# టక టక బండి

శ్రీ ఓ. స. మూర్తి

"అమ్మా! ఆ బండి కొనిపెట్టవూ!" అన్నాడు రవి దీనంగా ప్రార్థిస్తున్నట్లు దారినపోయే "టక్ టక్ బండ్లు" నమ్మే సాయిబు వైపు చూపిస్తూ.

"ఇప్పుడు డబ్బులు లేవు బాబూ. నాన్నగారు వచ్చిన తరువాత కొని పెడతారులే నాయనా!" అంది రవి కేశాలలోనికి తన మునివేళ్ళను పోనిచ్చి అతని తల్లి. రవి చిన్నపిల్లవాడయినా ఇంటి పరిస్థితి బాగా తెలిసిన బుద్ధిమంతుడిలాగా మారాం చేయకుండ తల్లి ముఖంలోనికి చూస్తూ వుండిపోయాడు. రవిని పోలిన పిల్లలు చాల అరుదు.

రవిని ఒడిలోకి తీసికొని వక్షానికి అదుముకొంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. చెమ్మగిల్లిన కళ్ళను చేతి కొంగుతో వత్తుకొంది. ఒకప్రక్క రవికి బండిని కొనిపెట్ట లేక పోతిననే బాధ. బండిని కూడా కొనిపెట్టలేని దారిద్ర్య మనుభవింపవలసి వచ్చిందనే చింత ఆమె హృదయ భారాన్ని పెంపొందింప జేసినది.

అమ్మ డబ్బులు లేవంది. డబ్బు వుంటే ఎంత బావుండును! బండి కొనుక్కోవచ్చు. ఒక్క బండేనా! ఎదురింటి వా రబ్బాయికి చిన్న సైకిలు వుంది. వాళ్ళ నాన్నకు కారుంది. అంతే కాదు. మంచి దుస్తులు వున్నాయి. ఊదుకొనే బూర వుంది. ఆడుకునే బంతి వుంది. వాళ్ళ నాన్న పెద్ద ఆఫీసరంట. మా నాన్నకూడా ఆఫీసరైతే! అన రెందు కవలేదు. అయితే తన కేమీ లోటు వుండకపోయేదిగా! నాన్ననే అడుగుతాను ఆఫీసరు ఎందు కవలేదని. అమ్మో! నాన్న నడిగితే కొప్పడడూ! కొప్పడితే యెలా! పోనీలే. నాన్న నడగను. అసలు డబ్బు లేకపోతే యివన్నీ రావా! డబ్బెందుకో! డబ్బులు లేకుండా యివ్వకూడదూ. అమ్మ డబ్బులోనే డబ్బుతోనే వుంది ప్రపంచమంతా అంది. ఏమిటో వెధవ డబ్బు! తెల్ల కాగితాలు; చిల్లపెంకులు అనుకున్నాడు రవి డబ్బంటే రోసిన బాలయోగిలా.

"రవీ! రవీ!" అని పిలిచాడు ఎదురింటి ఆఫీసరుగారి అబ్బాయి రఘు.

"ఇక్కడిక్కడే జాగ్రత్తగా ఆడుకుంటూండండి నాయనా!" అని అంటూండగానే రవి హడావిడిగా తల్లి వడిలోనుండి లేచి బయటకు పరుగెత్తాడు. అలా పరుగెత్తుకొని వెళ్తున్న రవివైపు స్పష్టంకాని సంతృప్తితో కాసేపు చూస్తూ నిలబడిపోయింది ఆమె. తరువాత అక్కడనుండి లోపలికి వెళ్ళిపోయింది.

"రవీ! మా యింటికిపోయి ఆడుకుందాం" అన్నాడు రఘు. "సరే!" అని తలవూపాడు రవి. బాలమిత్రు లిరువురు చెట్టాపట్టాలు వేసికొని ఎదురుగానున్న యింటిలోనికి వెళ్ళారు.

రవి దృష్టి "టక టక బండి" మీదకు పోయింది. "ఒరేయ్! రఘూ! నీ బండి తీసికొనిరా ఆడుకుందాం" అన్నాడు. అలాగే రఘు టక టక బండిని తీసికొని వచ్చాడు. దానిని చూడగానే రవికి లాగాలనిపించింది. రఘు తానొకసారి బండి లాగుతాను ఇవ్వమన్నాడు. 'నేను లాగుతుంటాను నీవు చూస్తూ వుండమనకుండా వెంటనే యిచ్చాడు రఘు.' రవి దానిని ఒకసారి లాగాడు. "టక్ టక్ మన్నది...." మరొకసారి లాగాడు. ఈసారి మరింత ఎక్కువ మోతతో "టక్ టక్" మన్నది. ఎప్పుడూ బండిని లాగాలనుకున్నాడు. కాని అదెలాగున సంభవ మవుతుంది. బండి తనది కాదుగా. కాసేపు వుంటే తన బండి తన కివ్వమంటాడు రఘు. అప్పుడైనా యివ్వవలసిందేగా. అబ్బే! యిలా కాదు తానొక బండిని తప్పకుండా కొనుక్కోవలసిందే ననుకున్నాడు. కాని అమ్మ డబ్బుల్లేవంది. నాన్నగారు కొనిపెడతారులే అంది. సాయంత్రం నాన్న ఆఫీసునుండి వచ్చాక అడగాలనుకున్నాడు. గట్టిగా అడగాలనుకున్నాడు.

వెంటనే రఘు బండి రఘుకి ఇచ్చివేశాడు. అప్పుడు రఘు "ఏరా రవీ! నీవు కూడా ఒక బండి కొనుక్కోకూడదూ! మనిద్దరం ఆడుకోవచ్చుగా" అన్నాడు.

"డబ్బులు లేవుగా" అంటూనే ఇంటికి పరుగెత్తుకొని పోయాడు రవి.

ఆతరువాత రఘు తల్లితో రవికి కూడా ఒక బండి వుంటే ఇద్దరూ కలిసి ఆడుకుంటామని, కాని రవివద్ద బండి కొనుక్కోడానికి డబ్బులు లేవని చెప్పాడు. అప్పుడామె రవి యింటి స్థితిగతులను బాగా తెలిసినదై వుండటంచే సరే అలాగే రేపు కొందాంలే అన్నది.

రఘు యింటినుండి సరాసరి వెళ్ళిపోయిన రవి హృదయావేగం యెక్కువయింది. "లబ్ డబ్"అనే హృదయ ధ్వని "టక్ టక్ బండి"ని జ్ఞప్తికి తెస్తూనే వుంది.


రవి తండ్రికోసం యెదురు చూడసాగాడు. చీకటి పడింది. కాని వాళ్ళ నాన్నగారు ఆఫీసునుండి ఇంకా రాలేదు. రవి తల్లిని అడిగాడు నాన్నగారింకా రాలేదేమని నాన్నగారు వచ్చేటప్పటికి కాస్త ప్రొద్దుపోతుంది. నీవు భోజనం చేసి పండుకోబాబూ అన్నది. రవి తండ్రి వచ్చేవరకు భోజనం చేయకూడదనుకున్నాడు. భోజనం చేస్తే ఎక్కడ నిద్ర ముంచుకువస్తుందోనని భయం అతనిది. కాని మారు మాటాడకుండా తల్లి వెంబడే వంటింట్లోకి దారి తీశాడు.

భోజనానంతరం ప్రక్కవేసి పండుకోబెట్టింది రవి తల్లి. రవి తల్లిని నాన్నగారింకా రాలేదేమని పలుమారు లడిగాడు. రవి ఆరోజు తండ్రి రాక కోసం ఎందుకు ఆతురతతో యెదురు చూస్తున్నాడో సులభంగానే గ్రహించింది అతని తల్లి. "టక టక బండి కావాలా నాయనా!" అంది, "ఊఁ" అన్నాడు రవి. "నాన్నగారితోచెప్పి రేపు కొనుక్కురమ్మంటాలే బాబూ! నీవు నిద్రపో" అంది రవి తల్లి. రవి మనస్సు కుదుటబడింది. తండ్రి రాకతో నిమిత్తం లేకుండగనే కొద్ది సేపటిలో నిద్ర పట్టింది రవికి.

రవి తల్లి భర్త యింటికి వచ్చిన తరువాత భోజన సమయంలో "టక టక బండి"ని గురించి చెప్పింది. రేపు ఆఫీసునుండి వచ్చేటప్పుడు తీసికొస్తానన్నాడు రవి తండ్రి.

మరునటిరోజు ఉదయాన బండ్లు అమ్మే సాయిబ్బువద్ద ఒక "టక్ టక్ బండి"ని కొన్నది ఆఫీసరుగారి భార్య.

రఘు బండిని రవికిస్తూ అచ్చంగా నీవే తీసుకోమన్నాడు. కాని రవి తన కొరకు బండిని వాళ్ళ నాన్నగారు తీసుకొస్తారన్నాడు. అయినా ఫరవాలేదు తీసుకోమన్నాడు రఘు. బాలమిత్రులిరువురు బండ్లను లాగసాగారు. బండ్లు "టక్ టక్" శబ్దం చేశాయి. కాని రవికి మాత్రం పూర్తిగాసంతోషం కలుగలేదు.



[illegible]

ఏదో తక్కువదనం అనుభవిస్తున్నట్లనిపించింది. రవి బండిని అక్కడే వదిలిపెట్టి ఇంటికి దారు తీశాడు. ఇంటికి వెళ్ళేటప్పటికి లోపల టక టక బండి కనపడింది. ఆశ్చర్యపోయాడు. ఒకవేళ రఘు ముందుగా వచ్చి బండిని ఇంట్లోపెట్టి వెళ్ళిపోయాడా అనుకున్నాడు. ఇంతలోకి వాళ్ళ పినతండ్రి కనపడ్డాడు."ఎప్పుడొచ్చావు బాబాయ్" అని అడుగుతూంటే రవి తల్లివచ్చి మీ బాబాయ్ నీ కొక బండి తీసుకొచ్చారు చూశావ్ అన్నది. రవి సంతోషంతో గంతులేశాడు.

ఆ సాయంత్రమే రవి తండ్రి ఆఫీసునుండి వస్తూ ఒక టకటక బండిని తీసికొనివచ్చాడు. రవి కిప్పుడు రెండు చేతులలో రెండు బండ్లు.

ఆఫీసరుగారబ్బాయికి రెండు బండ్లు. తనకు రెండు బండ్లు అని గర్వపడ్డాడు రవి. రెండు చేతులతో రెండు బండ్లను లాగాడు. బండ్లు "టక టక" శబ్దం చేసినవి. రవి హృదయం సంతృప్తితో నిండిపోయింది. ★